بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 21 Aug 2026 (Telugu)

# కృతజ్ఞతా భావం గురించి
# హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆచరణాత్మక ఆదర్శం

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 21.08.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తమ అనుచరులకు అల్లాహ్ తఆలా అనుగ్రహాలపై కృతజ్ఞత చూపడం పట్ల అత్యంత లోతైన దృష్టిని మరల్చేవారు. హజ్రత్ పీర్ సిరాజుల్ హక్ నూమానీ గారు ఒక సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తమను మియాఁ బఖ్ష్ సౌదాయీతో జరిగిన వివాదం గురించి అడిగి తెలుసుకున్నారని వివరించారు. సౌదాయీ పిచ్చివాడని, అతనిపై ఎలాంటి కలం చెల్లదని (అతని పనులకు జవాబుదారీతనం ఉండదని) హుజూర్ అలైహిస్సలాం అర్థమయ్యేలా చెప్పారు. కాబట్టి అలాంటి వ్యక్తితో వాదనలు, తగాదాలు పెట్టుకోవడానికి బదులుగా మంచిగా ప్రవర్తించవలెను. లోకం అలాంటి వారిని 'మజ్జూబ్', 'వలీయుల్లాహ్' మరియు 'కుతుబ్ సాహెబ్' అని పిలుస్తుంది, ఇది తప్పు. కానీ నిజానికి ఈ వ్యక్తులు ఎన్నో అనుగ్రహాలకు దూరం చేయబడతారు. వారు వివేకం, బుద్ధి, దుస్తులు, అన్నపానీయాల ఆనందం, భార్యాపిల్లలు, వారి పెంపకం వంటి అనుగ్రహాల నుండి, అల్లాహ్ తఆలాను గుర్తించడం, అతని జ్ఞానం, అతని ఉనికి, గుణగణాల విజ్ఞానం, ప్రవక్త మరియు సందేశహరుని ఘనత మరియు వారిని అనుసరించడం, పవిత్ర ఖుర్‌ఆన్ పఠనం, దాని అర్థాలు, రహస్యాలు, జ్ఞానాలు, శాసనం మరియు పద్ధతి, నమాజ్, ఉపవాసం, హజ్ మరియు జకాత్‌ల ద్వారా పొందే పుణ్యాలు మరియు ఉన్నత పదవులను కోల్పోతారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం మాట్లాడుతూ అలాంటి వారిని చూసినప్పుడు వాదించడానికంటే, అల్లాహ్ తఆలా మనల్ని ఆ అనుగ్రహాల నుండి దూరం చేయనందుకు అతనికి కృతజ్ఞతలు తెలుపుకోవాలని చెప్పారు. అతడు మనకు వివేకాన్ని, బుద్ధిని ప్రసాదించాడు, పవిత్ర ఖుర్‌ఆన్ పఠనం, దాని జ్ఞాన రహస్యాలతో నింపాడు, హలాల్ (ధర్మసమ్మతం), హరామ్ (అధర్మం) మధ్య తేడాను తెలుసుకునే విచక్షణను ఇచ్చారు, ప్రవక్తలను గుర్తించే అనుగ్రహాన్నిచ్చాడు మరియు తన ఉనికి, గుణగణాల జ్ఞానాన్ని అనుగ్రహించాడు. కనుక ప్రతీ అహ్మదీ తాను అల్లాహ్ తఆలాకు కృతజ్ఞత చెల్లించే హక్కును ఏ మేరకు నెరవేరుస్తున్నాడో ఆత్మపరిశీలన చేసుకోవలెను.

ఈ కృతజ్ఞతకు సంబంధించిన ఒక అత్యంత ప్రభావవంతమైన సంఘటనను హజ్రత్ మలిక్ ముహమ్మద్ హసన్ గారు వివరిస్తున్నారు. హుజూర్ ఫజర్ నమాజ్ కోసం వచ్చినప్పుడు నమాజ్ తర్వాత సేవకులనుద్దేశించి రాత్రి డప్పులు, వాయిద్యాలు ఎక్కడ మోగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. మిర్జా నిజాముద్దీన్ గారు ఒక నృత్య కారిణిని పిలిపించి, రాత్రికి ఇరవై రూపాయలు ఇస్తామని మాట ఇచ్చారని, అందుకే ఆమె రాత్రంతా నృత్యం చేస్తూ, పాడుతూ ఉందని ఆయనకు తెలియజేశారు. హుజూర్ అలైహిస్సలాం దీర్ఘంగా నిట్టూర్చి ఇలా అన్నారు: అల్లాహ్! ఉప్పు తిన్న విశ్వాసాన్ని ఆమె ఎంత చాటుకుంది! అంటే, ఆ స్త్రీ కేవలం ఇరవై రూపాయల కోసం రాత్రంతా మేల్కొని ఉంది, కానీ మనకు లెక్కలేనన్ని అనుగ్రహాలను ప్రసాదించిన మన నిజమైన సృష్టికర్త, యజమాని కోసం మనం

ఒకట్రెండు గంటలు కూడా మేల్కోలేకపోతున్నాము. హుజూర్ అలైహిస్సలాం ఈ మాటను పలు మార్లు పునరావృతం చేస్తూ మనం అల్లాహ్ తఆలా అపరిమిత అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపుకోము, నవాఫిల్, నమాజుల పట్ల శ్రద్ధ చూపము, చివరికి ఫజర్ నమాజ్ కోసం లేవడం కూడా మనకు కష్టమైపోతుందని చెప్పారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కావున మనం అల్లాహ్ తఆలాకు కృతజ్ఞత చెల్లించే హక్కును ఏ మేరకు నెరవేరుస్తున్నామో? అను విషయంలో ప్రతీ అహ్మదీ ఆత్మపరిశీలన చేసుకోవలెను.

హజ్రత్ షేఖ్ ముహమ్మద్ ఇస్మాయిల్ సర్దావీ గారు వివరిస్తూ, హుజూర్ భోజనం చేసేటప్పుడు 'సుబ్‌హానల్లాహ్', 'అల్హమ్దులిల్లాహ్' అని పలికే అలవాటు కలిగి ఉండేవారని, ఏదో వస్తువు కోసం వెతుకుతున్నట్లుగా భోజనం చేసే వారని చెప్పారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు తఆలా అన్హు కూడా వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం రొట్టె చిన్న ముక్కను నోట్లో వేసుకుని బాగా నములుతూ ఉండేవారని, పెద్ద ముక్క తీసుకునేవారు కాదని, దానితో పాటే 'సుబ్‌హానల్లాహ్, సుబ్‌హానల్లాహ్' అని పదే పదే అనేవారని చెప్పారు. ఆ తర్వాత కాసేపటికి అందులోని ఒక ముక్కను కూరలో నంజుకుని తినేవారు. ఈ విధంగా, భోజనం లాంటి సాధారణంగా కనిపించే అనుగ్రహంలో కూడా అల్లాహ్ తఆలా పట్ల కృతజ్ఞతా భావం స్పష్టంగా కనిపించేది.

హజ్రత్ సయ్యద్ జైనుల్ ఆబిదీన్ వలీయుల్లాహ్ షా గారు వివరిస్తూ, ఏదైనా ప్రాంతంలో లేదా నగరంలో ప్లేగు (తాఊన్) వ్యాధి ప్రబలినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తమ ఇల్లు, బోర్డింగ్ హౌస్ మరియు అనుచరులందరి ఇళ్లను శుభ్రంగా ఉంచేలా ఏర్పాట్లు చేసేవారని చెప్పారు. అలాగే గంధకం, నిప్పు, ఫినాయిల్ మరియు గుగ్గిలం మొదలైన వాటి సహాయంతో క్రిములను నశింపజేయాలని స్పష్టంగా ఆదేశించేవారు. భౌతిక సాధనాలను ఉపయోగించడం కూడా అల్లాహ్ తఆలా అనుగ్రహానికి కృతజ్ఞత చెల్లించడమేనని హుజూర్ అలైహిస్సలాం ప్రవచించేవారు. వ్యాధులు, మహమ్మారుల ప్రభావాన్ని దూరం చేయడానికి సాధనాలుగా ఉపయోగపడే వస్తువులను అల్లాహ్ తఆలా సృష్టించాడు. కనుక సాధనాలను విడిచిపెట్టడం దైవ శాసనానికి విరుద్ధం. అయితే దేవునిపై నమ్మకమనే స్థానం సాధనాలను పాటించిన తర్వాతే వస్తుంది. సాధనాలను ఉపయోగించినంత మాత్రాన వాటిపైనే పూర్తి నమ్మకం ఉంచుకోకుండా ఆ సాధనాల వెనుక ఉన్న అల్లాహ్ తఆలా చేతిని (శక్తిని) చూడవలెను.

హజ్రత్ ముహమ్మద్ ఇబ్రహీం గారు ఒక సంఘటనను వివరిస్తూ 1904వ సం॥లో గుర్దాస్‌పూర్‌లో 'కరమ్ దీన్' కేసుకు సంబంధించిన బస సమయంలో ఒక మిత్రుడు తాజా ఖర్జూర పండ్లను తీసుకువచ్చారు. ఎవరో అవి వేడి చేస్తాయని అనగా, ఉల్లిపాయ తినడం వల్ల వాటి వేడి ప్రభావం తొలగిపోతుందని చెప్పారు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం మాట్లాడుతూ అల్లాహ్ తఆలా అద్భుతమైన ఏర్పాట్లు చేశాడని, ప్రతీ వస్తువు లోపాన్ని లేదా ప్రభావాన్ని సరిదిద్దే మరొక వస్తువును అందుబాటులో ఉంచాడని చెప్పారు. హుజూర్ అలైహిస్సలాం మామిడి పండు-నేరేడు పండు, మరియు అరటి పండు-పచ్చి బియ్యం ఉదాహరణలను వివరించారు. ఆ తర్వాత మానవుడి కోసం అల్లాహ్ తఆలా చేసిన ఆధ్యాత్మిక మరియు శారీరక ఉన్నతమైన ఏర్పాట్లను ప్రస్తావిస్తూ మనిషి వీటన్నింటికీ తగినట్లుగా అతనికి కృతజ్ఞతలు కూడా చెల్లించలేడని అన్నారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అనారోగ్యం నుండి కోలుకున్నప్పుడు కూడా అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'తజ్కిరతుష్ షహాదతైన్' అనే పుస్తకాన్ని రచిస్తున్న సమయంలో హుజూర్ అలైహిస్సలాంనకు తీవ్రమైన మూత్రపిండాల నొప్పి వచ్చింది. దాంతో ఈ రచన పూర్తి కాదేమోనని ఆయన భావించారు. రాత్రి వేళ ఇంటి వారందరినీ సమకూర్చుకుని ప్రార్థన (దుఆ) చేశారు. అలాగే సాహెబ్‌జాదా మౌల్వీ అబ్దుల్లతీఫ్ గారి జ్ఞాపకంతో అల్లాహ్ తఆలా ఈ పుస్తకాన్ని పూర్తి చేసే అనుగ్రహాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. దుఆ ముగిసిన తర్వాత హుజూర్ గారిపై ఒకరకమైన నిద్రమత్తు ఆవహించింది మరియు سَلٰمٌ قَوۡلًا مِّنۡ رَّبٍّ رَّحِیۡمٍ అనే దివ్యవాణి వినబడింది. ఉదయం ఆరు గంటల కంటే ముందే ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యారు మరియు అదే రోజు దాదాపు సగం పుస్తకాన్ని రాసి పూర్తి చేశారు. చివరగా హుజూర్ అలైహిస్సలాం "ఫల్ హమ్దులిల్లాహి అలా జాలిక్" (అందుకు అల్లాహ్ తఆలాకే సమస్త స్తోత్రాలు) అని అన్నారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం 'బరాహీనె అహ్మదియ్య' పుస్తకాన్ని వ్రాయడం, ప్రచురణలో ఆర్థిక సహాయం అందించిన వారి పేర్లను కూడా నమోదు చేశారు మరియు వారి కోసం దుఆ చేయాలని ప్రేరేపించారు. ఈ సహాయకుల్లో ఐదు రూపాయలు, రెండు రూపాయలు, చివరకు రెండు అణాలు ఇచ్చిన వారు కూడా ఉన్నారు. ఈ సహాయకులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ, వారి ఉదారమైన శ్రద్ధ వల్ల ధార్మిక లక్ష్యాలు వ్యర్థం కాకుండా రక్షించబడ్డాయని, శ్రమ వృథా కాకుండా కాపాడబడిందని హుజూర్ అలైహిస్సలాం చెప్పారు. ఈ పుస్తకం ద్వారా లబ్ధి పొందే ప్రజలు తమ కోసం మరియు ఆ సహాయకుల కోసం శుభ ప్రార్థనలు చేయాలనే ఉద్దేశంతోనే ఆయన వారి పేర్లను నమోదు చేశారు.

హజ్రత్ మియాఁ మంజూర్ ముహమ్మద్ గారిని ప్రస్తావిస్తూ, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆయన చూచిరాత సేవలను, నిష్కల్మషమైన భక్తిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన లౌకిక ప్రయోజనాల కోసం కాకుండా కేవలం ధర్మంపై ఉన్న ప్రేమతోనే పనిచేస్తున్నారని, ఎంతో కష్టపడి తన సేవలను అందిస్తున్నారని వివరించారు. ఇలాంటి నిస్వార్థ సహాయకులను హుజూర్ అలైహిస్సలాం అల్లాహ్ తఆలా ప్రత్యేక అనుగ్రహంగా అభివర్ణించారు, తమ ధార్మిక పనుల పూర్తికి వారి సేవలు బలమైన సాధనాలుగా నిలిచాయని కొనియాడారు.

హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ గారు వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం సేవకులు చేసే చిన్న చిన్న పనులను కూడా ఎంతో విలువైనవిగా భావించేవారని, వారిని ప్రోత్సహించేవారని చెప్పారు. ఏదైనా పుస్తకం లేదా పత్రికను త్వరగా ప్రచురించాల్సి వచ్చి రాత్రుళ్ళు పనిచేసేటప్పుడు, ప్రెస్ ఉద్యోగుల కోసం పాలు మరియు ఇతర పదార్థాలను ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేసేవారు. వారికి సాధారణం కంటే ఎక్కువ కూలీ ఇవ్వడమే కాకుండా, వారి పనితీరు పట్ల సంతోషాన్ని మరియు ధన్యవాదాలను వ్యక్తం చేసేవారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) వివరిస్తూ ప్రవక్తల హృదయాలు ఎంతో కృతజ్ఞతా భావం కలిగి ఉంటాయని చెప్పారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పుస్తకాలు రేయింబవళ్లు ముద్రించబడుతున్నప్పుడు ఆయన వరుసగా అనేక రాత్రులు నిద్రపోయేవారు కారు. అయినప్పటికీ, రాత్రి వేళ ఎవరైనా 'ప్రూఫ్' తీసుకువస్తే, వారి స్వరం వినగానే స్వయంగా లేచి ఆ ప్రూఫ్‌ను తీసుకుంటూ "జజాకల్లాహు అహ్సనల్ జజా" (అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక) అని వేడుకునేవారు. ఆ వ్యక్తి పడుతున్న శ్రమను హుజూర్ అలైహిస్సలాం మనస్ఫూర్తిగా గ్రహించేవారు. దీనిని బట్టి ఇతరులు చేసే ఉపకారం పట్ల, వారు పడే శ్రమ పట్ల ప్రవక్తల హృదయాలలో ఎంతటి గొప్ప భావన ఉంటుందో స్పష్టమవుతోంది.

హాఫిజ్ నబీ బఖ్ష్ గారు ఒక సంఘటనను వివరిస్తూ ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారు తోటలో విహరిస్తున్నారు. ఆయన చేతిలో ఒక బెత్తం (కర్ర) ఉంది, అది ఒక చెట్టులో చిక్కుకుపోయింది. కొందరు అనుచరులు దానిని కిందకు దించేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు. అప్పుడు నబీ బఖ్ష్ గారు చెట్టు ఎక్కి ఆ కర్రను కిందకు తీశారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం దీనికి ఎంతగానో సంతోషించి, మియాఁ నబీ బఖ్ష్ చెట్టు ఎక్కి వెంటనే కర్రను కిందకు తీసి అద్భుతం చేశారని పదే పదే ఆయనను ప్రశంసించారు. హుజూర్ అలైహిస్సలాం చిన్నవారైనా, పెద్దవారైనా అందరినీ ఎంతో గౌరవంతో సంబోధించేవారు.

డాక్టర్ మీర్ ముహమ్మద్ ఇస్మాయీల్ గారు వివరిస్తూ, హజ్రత్ గారి కోసం ఎవరైనా కానుక తీసుకువస్తే ఆయన ఎంతగానో కృతజ్ఞతలు తెలిపేవారని, ఇంట్లో కూడా ఆ వ్యక్తి నిష్కల్మషమైన భక్తి గురించి ప్రస్తావించేవారని చెప్పారు. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు మరొక సంఘటనను వివరిస్తూ డాక్టర్ ఖలీఫా రషీదుద్దీన్ గారు ఆగ్రా నుండి ఖాదియాన్‌కు వచ్చినప్పుడు హజ్రత్ గారి కోసం 'ఖుర్మాలు' (బాదుషా రకానికి చెందిన తియ్యని పిండివంట) తీసుకువచ్చేవారు. ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఉదయం నుండి భోజనం చేయలేదు. కానీ ఆగ్రా నుండి తన కోసం ఖుర్మాలు తీసుకువచ్చారని తెలిసినప్పుడు ఎంతో సంతోషించారు, వాటిని మెచ్చుకుని ప్రశంసించారు మరియు కొన్నింటిని తన కోసం ఉంచమని చెప్పారు.

గుర్దాస్‌పూర్‌లో 'కరమ్ దీన్' కేసుకు సంబంధించిన సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు,

డాక్టర్ ఖలీఫా రషీదుద్దీన్ గారు తన ఇంట్లో ఉన్న డబ్బునంతటినీ పంపడమే కాకుండా, భవిష్యత్తు ఆదాయాన్ని కూడా పంపుతూ వచ్చారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆయన చేసిన ఈ త్యాగాన్ని గ్రహించి మీరు త్యాగానికి హద్దులు దాటేశారు, ఇకపై చందా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయనకు లేఖ రాశారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) వ్యాఖ్యానిస్తూ ప్రారంభంలో ఆయన బాధ్యతగా చందా ఇచ్చేవారని, ఆ తర్వాత కృతజ్ఞతగా కూడా ఇస్తూ వచ్చారని చెప్పారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తమ సంతానాన్ని వసియ్యత్ చందా నుండి మినహాయించారని, కానీ తనకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి "అఫలా అకూను అబ్దాన్ షకూరా" (నేను అల్లాహ్‌కు కృతజ్ఞత కలిగిన దాసుడిగా మారకూడదా?) అనే పవిత్ర వచనం గుర్తుకు వచ్చిందని చెప్పారు. దాంతో నేను కృతజ్ఞతాపూర్వకంగా చందా ఇవ్వడం ప్రారంభించాను. నా చందా మూసీల కంటే ఎక్కువైనది. ఆ తర్వాత నాకు "ఈమలూ ఆల దావూద శుక్రా" (ఓ దావూద్ సంతానమా! కృతజ్ఞతా భావంతో సత్కార్యాలు చేయండి) అనే దివ్యవాణి అయింది. దాంతో నేను అల్లాహ్ పట్ల కృతజ్ఞతతో ఎంతో చందాను సమర్పించాను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలామ్ గారి 'వసియ్యత్' ప్రకారం మినహాయింపు అనేది కేవలం ఆయన ఐదుగురు పిల్లలకు మాత్రమే వర్తిస్తుంది. అంతే తప్ప వారి సంతానానికి, కుమారుల భార్యలకు లేదా కుమార్తెల భర్తలకు కాదు. ఎవరైతే వసియ్యత్ చేస్తారో వారు వసియ్యత్ చందాను మరియు ఆస్తిలోని భాగాన్ని కచ్చితంగా చెల్లించాల్సిందే. 'బహిష్తీ మఖ్బరా'లో సమాధి అయ్యే అనుమతి కూడా ఆ ఐదుగురు పిల్లల వరకే పరిమితం, అయినప్పటికీ హజ్రత్ అమ్మా జాన్ గారు మరియు హుజూర్ (అ) సంతానం ఎన్నో త్యాగాలు చేశారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) తర్వాత ఏ ఖలీఫాకు కానీ లేదా ఆయన కుటుంబ సభ్యులకు కానీ ఎలాంటి మినహాయింపు లేదు; అందరూ వసియ్యత్ చేశారు, చందా చెల్లించారు. ఇతర ధార్మిక పిలుపులలో తమ శక్తి మేరకు పాల్గొన్నారు. ఈ మినహాయింపు కేవలం ఆ ఐదుగురు పిల్లలకు మాత్రమే ఉండేది, కొన్ని చోట్ల నుండి నా దగ్గరకు ఒక ప్రశ్న వచ్చినందుకే నేను ఈ స్పష్టత ఇస్తున్నాను.

హజ్రత్ మియాఁ సద్రుద్దీన్ గారు ఒక సంఘటనను వివరిస్తూ ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం 'చిరాగ్' అనే చప్రాసీకి ఒక పైసా ఇచ్చి 'రేవ్డీలు' (నువ్వుల మిఠాయి) తెప్పించారు. రేవ్డీలు రాగానే హుజూర్ (అ) వాటిని రెండు భాగాలుగా చేసి, ఒక భాగాన్ని అతనికి ఇవ్వబోయారు. అతడు తీసుకోవడానికి నిరాకరించగా, హుజూర్ (అ) మాట్లాడుతూ "పైసా నాదే కావచ్చు, కానీ శ్రమ నీది. నువ్వు వెళ్లి తీసుకువచ్చావు, కాబట్టి సగం భాగం నీదే" అని చెప్పారు. ఇతరులు చేసే పనిని గౌరవించడం, కృతజ్ఞత చూపడంలో ఇదొక అద్భుతమైన విధానం.

మరొక సందర్భంలో బటాలాలో మిత్రులు టీ ఏర్పాటు చేశారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) టీ అందించిన వారి గురించి అడిగి తెలుసుకుని, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత పత్రికలో కూడా ఆ వ్యక్తుల సేవల గురించి ప్రకటిస్తూ వారిని అభినందించారు. దీనిని బట్టి హుజూర్ (అ) ఎవరైనా చేసే చిన్న సేవను కూడా ఉపేక్షించకుండా, దానిని ఎంతో విలువైనదిగా భావించి కృతజ్ఞతలు తెలిపేవారని తెలుస్తోంది. అల్లాహ్ తఆలా మనకు కూడా కృతజ్ఞతా భావంలో ఉన్నత ప్రమాణాలను అవలంభించుటకు అనుగ్రహించుగాక! ఆమీన్.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ
وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔